లింగం వీరభద్రయ్య చౌదరి

గృహలక్ష్మి

ప్రాణ మలసట జెందినది. ఉదయమున నేగి సాయంతనమున కింటికి జేరుకొనినాడు. ఎడతెగని పని, సేవకుల యడ్డంకులు, ప్రార్థేయుల ప్రార్థనలు, సహోద్యోగుల ప్రశ్నలు, ప్రాణము విసిగించి వేసినవి. పైగా, పైయధికారుల తర్జన భర్జనలు. ఈజీవిత మెంత దుర్భరము!—ఎండలు సాగినవి. దిక్కుమాలిన యాఫీసులో, ఎలెక్ట్రిక్ ఫ్యాన్సు లేవు సరేగదా ఉన్నపంకాయైన సగము చిరిగిపోయినది. పంకాలాగువా డెంత సోమరిపోతు! ఈరోజులలో సేవకులకు బూర్వమున్న భయభక్తులు లేనేలేవు. సమయము చిక్కినప్పు డెల్ల బని నెగగొట్టవలె నని చూచుచుందురు. వాండ్ర కింకను దమపనిని దాము నిర్వర్తించవలె నను జ్ఞానము కలుగలేదు. బీగము ఇచ్చిన గడియారము చేతుల వలె పంకావాని రెండుచేతు లెడతెగ కెప్పుడు పనిచేయుచున్నను గాలి యీపాడుమూల నున్న కుర్చీ టేబుల్‌లకు చేరదు. చేరినకొంచెము, శరీరమును చల్ల జేయుటకు మారుగా పొగ లెగయ జేయుచున్నది. అబ్బా! ఏమి నిస్సారము! దహించుకొనిపోవుచున్న ఆకలిమంటను మాన్పుట కింత మజ్జిగనీరైన లేకపోయినదిగదా! ఇక, కలవుదీరు ఫలహారము, కంచుచెంబుతో దెచ్చిన ఇగమువంటి మంచినీళ్ళసంగతి చెప్పవలయునా? ఆఫీసు బాసలోని నీళ్లంత శుభ్రముగా లేవు. వాళ్లు ముంచి, వీళ్లుముంచి, పైగా నీహారుగాలి, దుమ్ము అన్నియు నలకలే. నాకరిచేత దెప్పించుకొనిన సోడానీళ్లుమాత్రమే గతి. పాడుముండాకొడుకులు, శుచియా, శుభ్రమా—అసలు సోడాయే బాగుగ నుండలేదు. అప్పటికప్పుడు మరలోనుంచి ఫోర్సుగా బట్టించిన కొంత బాగుగనుండునేమో?—ఎట్లో కాలము గడిచినది. సాయంత్రము కావచ్చినది. బ్రతుకుజీవుడా పని పూర్తియైపోయినది. ఒక్క పెద్దనిట్టూర్పు విడిచినాడు. ఇక నింటి కేగవచ్చును. తలపువచ్చినది; హృదయ మాహ్లాదపూరితమైనది; ముఖము వికసించినది. సౌందర్యరాశి, దరహాసవదన, తన యర్థాంగి; కలకలలాడు బిడ్డలు. గృహ మెంత యానందదాయకము! తత్క్షణమే యింటికి బైలుదేరినాడు. త్వరితముగా నడచి యింటికి జేరుకొనినాడు. చిరునగవుతో దనభార్య యెదురువచ్చినది. 'నాన్నా, నాన్నా' యని కేరింతలు గొట్టుచు పిల్లలు వచ్చి కాళ్ల కడ్డము పడినారు. దేహము పులకాంకిత మైనది; జీవితము ధన్యమైనది.

ఆమె యుదయమున జీక టుండగనే లేచినది. వందిమాగధులు గాని, నిద్ర పట్టక జాగరణము చేయు ముసలివాండ్రు గాని, "కోమ టెంకమ పేడ కొచ్చెను... మేలుకో" అని యెలుగెత్తి పాడు కొంటెపడుచువాండ్ర పాటలు కాని యామెకు సాయము జేయలేదు. పక్షుల కిలాకిలారావములు మేల్కొలిపిన వని చెప్పిన నిజముండదు. ప్రభాతమందమారుతములు మెల్లగా, చల్లగా, హాయిగా వీచి ఆమెను నెమ్మదిగా లేపిన వని కవిత్వించలేను. నిజమున కామె పక్షులకు ముందుగనే లేచి యుం

డినది. వీచుచుండినది మందమలయానిలము గాక జిల్లుపెట్టి శరీరమును కట్టెజేయు కటికిశీతవాయువులు. అరనిముసముక్రిందవరకు కౌగిలించుకొనియున్న ప్రియుని శరీరమువేడిమి, హృదయమువ నిశ్చలముగ వెలుంగుచున్న ప్రేమజ్యోతి వేడిమి ఆమెచలిబాధ నుపశమనములు. స్వాభావికముగ జన్మించు 'ఊహుహూలు' పెదవులు దాటి వైటికి రాకముందే మనమున నావరించియున్న సంతోషానందముల మిశ్రమమున జిరునగవులై మొగమునంతటిని గప్పివేసినవి. స్నానము జేసినది; తల ముడుచుకొనినది; శుభ్రవస్త్రము ధరించినది. సంతోషము, తృప్తి ప్రేమ యామెముఖమున తాండవించుచున్నవి. ఇంటిపనుల జక్కపెట్టుట కారంభించినది. బిడ్డలు లేచినారు. వాండ్రు సరిగా నున్నప్పుడు ముద్దులుగాని లేనప్పుడు మొద్దులు. పిల్లలపోరు తల్లికే యెఱుక. ఎంత మంచి బిడ్డ యైనను లేచుటతోడనే వ్యథ కలుగజేయకమానదు. ఉషఃకాలము శిశువులకు, చంద్రునకు రాహుకాలమెట్టిదో, యట్టిదేమో యనుకొందును. పిల్లల కట్లున్నను, తల్లుల కది నిజముగ గ్రహణకాలమే. గల్లున గగ్గోలుపెట్టుదురు. గగ్గోలు పెట్టునవి దాటినను, ఏడ్పు మొగములతో వచ్చి కాళ్ల కడ్డముపడుదురు. చిరునగవుతో సౌజన్యముగ కావలసిన దడిగి తల్లిచేత చెప్పించుకొనుట గాని, చేయించుకొనుట గాని చేయుపిల్ల లరుదు. పాప మామెను నిజముగా చిరాకే కలిగింతురు. ఆమె పనుల కడ్డమువత్తురు. కాని గట్టిగా కసరుకొనదు. “ఎక్కడిపిల్లలురా, మీకడుపు కాల” యని ప్రాతఃకాలపుదీవెన లీయదు. ఎప్పుడును పిల్లలు పిల్లలే. ముండ్లున్నగులాబిపువ్వులు. కష్టసుఖముల కావడికుండలు. వాండ్రను లాలించినది. ముఖమార్జనము మొదలైనవి చేయించినది. నాయనతోపాటు మొగము కడుగుకొనిన మతింతసంతోషము. ఒకరిద్దఱకు జల్దియన్నము దినునభ్యాసమున్నది. వారికద్దాని బెట్టినది. బట్టలు విడిపించి, తలలు దువ్వి, బొట్టు పెట్టి ముస్తాబు చేసి వాండ్రను బడికి బంపించినది. భర్తకు గాఫీ తీసికొను టభ్యాసము. అతనికి గాఫీ యుపమాల జేసి యిచ్చినది. భర్తకు గాఫీ యిచ్చుటామెకు సంతోషము. పూర్వాచారపరురాలైన పూర్వసువాసిని దేవునకు నైవేద్యము బెట్టిన ట్లామె భర్తముం దుపమా పెట్టినది. గంగాభవానీ సమానురాలు కొబ్బరికాయ గొట్టి లోటలోటమని నీరు వంచునట్లు అతనికప్పులో గాఫీ పోసినది. భగవంతునే మానసికముగ భర్తను జేసికొనియున్నవిధవ భక్తికిని, భర్తను దేవునిగా జూచుకొనుచున్న మన పుణ్యస్త్రీ భక్తికిని భేదము రవంతైన లేదు. భక్తి ప్రధానము కాబట్టి, ఆచరణయందు భేద మున్నను, మోక్షమున కిరువురు సమముగనే పోవుదురు.

ఇక వంట జేయుట కారంభించినది. ఏమిసంసారము! ఏదో సంసారపక్షము; ఒక టుండిన నొక టుండదు; దానికి దీనికి జతపర్చవలెను, ముడివేయవలెను. ఒక్కొకప్పుడు గరికతో బచ్చడి చేసి 'రాజును' మెప్పించవలెను; పాకముల నున్నది గాని పదార్థముల కేమి? పప్పులు, ఊరగాయ లిచ్చిన నెంత తృప్తిగానైన భోజనము చేయించవచ్చును. పప్పుపులుసు స్వర్గము జూపించును. అందులో నిమ్మకాయ పిండిన నెంతరుచి? ఇక ములక్కాయసంగతి చెప్పనేయక్కఱ లేదు. వీనికన్నిటి కేమిగాని నాలుగు పెద్దయుల్లిపాయలు పడినవా రంభతో నృత్యము జేసినట్లే యుండును. భర్తకు గాకరకాయల యంటుపులుసు మిక్కిలి యిష్టము. వానిదుంపదెగ వారము రోజులనుండి ప్రయత్నించుచున్నను ఎక్కడను దొరకుటలేదు. నిన్నసాయంత్రము వెంకటసామి 'రామయ్యగారి దొడ్డిలో నున్నవి. నాలుగు పిందె లడిగి తెచ్చిపెట్టెద' ననినాడు. ఇంకను రాలేదు. ప్రొద్దెక్కుచున్నది. వారికి ఆఫీసువేళ కావచ్చుచున్నది. రెండవ అబ్బాయికి కందిపచ్చ డనిన నిష్టము. దానిని త్వరగా జేయవలెను. బుడ్డది రాత్రి సరిగా నన్నము తినలేదు. కొంచెము జ్వరము తగిలినట్లున్నది. సాలె నరసింహమును బిలిపించెద నన్న నా కేమి వద్దులే మందని బడిలోనికి బోయినది. పొట్లకాయ జ్వరమునకు మంచిది. కొంచెము పెసరబద్దలు వేసి తిరుగబోత వేసిన

బాగుగ నుండును. చిన్నపిండె ఒకటి దొడ్డిలో నుండవలెను. పిల్లలు బడినుండివచ్చువేళ యైనది. వచ్చినప్పటి నుండి 'అన్నమన్న'మని మీద బడుదురు. ఆయనగారేమో వ్రాసికొనుచున్నట్లున్నది. పాపము కాస్తంత సేపు హాయిగుని కాలుమీద కాలువేసికొని యింటి యొద్ద కూర్చుండుటకు వీలుండదు. ప్రొద్దస్తమాన మొకటేపని వారట్లు కష్టపడి సంపాదించకపోయిన మాపని యేమి కావలెను?—వంట పూర్తియైనది. స్నానము సిద్ధపరచినది. అంగవస్త్రము, తుండుగుడ్డ, కట్టుపంచె తెచ్చి స్నానమునకు లెండని చెప్పినది. భర్తస్నానము జేసినాడు. ఇంతలో బిల్లలు వచ్చినారు. కీచురు, కాచురు. వారికి, భర్తకు భోజనము పెట్టినది. చేతిమీద వేయించుకొనుట పెద్దబ్బాయికి గిట్టదు; నేతిగిన్నె ముందర బెట్టవలెను. అట్లు పెట్టిన నితరపిల్ల లూరుకొనరు. వాడు లాగి, వీడులాగి వాడెక్కువ వేసికొనినాడని, వీడెక్కువ వేసికొనినా డని. పాపము కమలముమాత్రమేపోరులేక తనకు బెట్టిన దేదియో తినును. పెనిమిటికి ములక్కాయ ముక్కలనిన నిష్టము. పప్పుపులుసులో నుండి దేవి నాలుగు ముక్కలు వడ్డించినది. 'నాన్నకువేసినావు. నాకేవి' యని పిల్ల లెగబడినారు. 'లెక్కకు రెండు కాయలే దొరికినవిరా, మీ నాన్న కవియన్న నిష్ట' మని యెంత చెప్పినను పిల్ల లూరకొన లేదు, తలకొక ముక్క బెట్టినది. రెండవవాడెప్పుడు గడుసే. 'నాకు లేకుండ నన్నియు, నీవే తినుచున్నావే' యని నాన్నను గద్దించినాడు. 'నీమొఖం; గల్లంతు చేయకుండా నీకు పెట్టిన దేదో తిను' అని తండ్రి సమాధానమిచ్చినాడు. ఈరోజున మజ్జి గెందుచేతనో మిక్కిలి పల్చగనున్నది. ఫస్ట్ క్లాస్ బర్రెయుండి, దివ్యమైన గడ్డవంటి పెరుగు వేసికొనిన స్వర్గమునకు బెత్తెడెడముగ నుండును. గాని పాడుముండలు, ఈగొల్లవాండ్రు దెచ్చి యమ్మ కటిక నీళ్లు రుచియా, పచియా? నిమ్మకాయచెక్క వేయించుకొని రసముపిండుకొని యింతయుప్పు కలిపినాడు. ఎట్లయిన నిమ్మకాయకు సరిపోయినవస్తు వేదియు లేదు. మామిడియూరగాయ, నిమ్మకాయపచ్చడి, దబ్బకాయపచ్చడి యందురు గాని మజ్జిగ పల్చనైనప్పుడు వానిపస యేమియు బనికి రాదు. అప్పుడు నిమ్మకాయరసము ఉప్పే కావలసి యుండును. కలిగినదానిని దృప్తిగ భోజనము చేసినాడు. తానెంత యదృష్టవంతుడు! అందచందములకు దోడు తనభార్య మంచివంటకత్తె. ఆమెపాకము లెంతరుచిగానుండును! పగమన్నము కాకరగాయ అంటుపులుసుతోనే తినివేసినాడు. వేళ కావచ్చినది. బట్టలు త్వరగావేసికొని యాఫీసునకు బైలుదేరినాడు. పెందలకడనే రండని యథాప్రకారము భార్య యనినది. సరేయని చిరునగవుతో దల యెగరవేసినాడు.

తనభోజనము మొదలువెట్టినది మజ్జిగే పల్చనైనది గాని భర్త తృప్తిగానే భోజనము చేసినాడు. పిల్లలకును గాకరకాయకూర యిష్టమే. ఏమియు మిగిలినట్లు లేదు. అబ్బా, ఏమిదుండగీడుపిల్లలమ్మా! ఎగబడి మఱి ములగముక్కలు, ఉల్లిపాయలు పూర్తిచేసినాడు. కందిపచ్చడి రుచిగానే యున్నది. కృష్ణుడు మఱికాస్త పెట్టవే అమ్మాయని పెట్టించుకొని తిన్నాడు. కమలం తిండి రాత్రికంటె మెలుగే. ఆసన్యాసికి జ్వరము లోపల నింక నున్నట్లున్నది. నామనస్సులో నట్లుండును గాని, పిల్లలైనతర్వాత జ్వరములు రాక యుండునా? అదే పోవును. భోజనము పూర్తిచేసినది. చావడిలోను, వీథియరుగులమీదను పిల్లలేదో ఆడుకొనుచున్నారు.

చీకటినుండియు నొకటే పని కొంచెమాయాసముగ నున్నది. పదినిమిషములు విశ్రమించెద ననుకొన్నది. చావడిలో జిరుచాప వేసికొని అట్టె తలవాల్చినది. ఎన్నియో నిమిషములు కాలేదు. గంపెడంతపని యుండగా సోమరిపోతువలె నిద్రించుటేమి! చప్పున లేచినది. కందిపప్పు పూర్తిగావచ్చినది. క్రిందటి యాదివార మొక యిరసకందులు బజారునుండి పట్టించుకొని వచ్చినారు. ప్రక్కయింటి సుబ్బమ్మ కాస్తంతసేపు వచ్చి ఆలాగే వేయించిపెడతాలే యని చెప్పినది. ఆమెకిప్పుడు తీరికగానే యుండవచ్చును. ప్రొద్దు తిరుగక పూర్వమే ఆపని చూడనియెడల మరల నిబ్బందిపడవలసివచ్చును. మినపపప్పు కొంచె మున్నట్లున్నది. వెంకమ్మతీసికొని వెళ్లిన బదు లిచ్చిన నిప్పటిలో నంతయి

బ్బంది యుండదు. అనుటయే కాని యీ లేమిడిసంసారములో దినినన్ని గారెలకు నోచుకొనినామా! ఎప్పుడైన ఫలహారము చేయవలెనన్న నేసెనగపిండియో ఇంటిలోనుండకపోదు. ప్రక్కయింటి సుబ్బమ్మను పిలిచినది. ఆపూర్వసువాసిని రెండుమూడు పిల్పులైనతర్వాత పలికి, 'ఏమియెండలమ్మ, దీనిదుంపదెగ ఒకటేదాహము. ఇప్పుడే రవంతసేపు వోరగిలినాను. నీకేకలు విని యులికిపడి లేచి వచ్చుచున్నా'ననుచు లోపలికి వచ్చినది. కంది పప్పు చేయుటారంభించినారు. పిల్లలు బడికి వెళ్లువేళ యయినది. వాండ్రను బిలిచి తలాకాస్త అన్నము పెట్టినది. బట్టలను సర్ది మొగములు తుడిచి బడికిపంపినది. సుబ్బమ్మ చలవవలన పప్పు విసరు టారంభించినది. అప్పుడే మూడుగంటలు కావచ్చినది. వారెప్పుడూ ప్రొద్దున పది గంటలకు భోజనము చేసి వెళ్లినారు. పాప మాకలి వేయుచుండ వచ్చును. పనిలో బని చేరెడంత సెనగ పిండి కలిపి నాలుగు మెత్తనిపకోడీలు చేసిన, వారు వచ్చుటతోడనే ఫలహారము చేయుదురు. చేతినిండ డబ్బుండి, నౌక రుండిన నెంతబాగుగ నుండును! మధ్యాహ్నము రవంత చిరుదిండి చేసి ఆఫీసునకు బంపిన బాగుగ నుండును గదా— కందిపప్పెట్లో తయారైనది. ఇక వెళ్లెద నమ్మా యని దోసెడుపప్పు చీరచెరగున గట్టుకొని సుబ్బమ్మ తనయింటికి వెళ్లిపోయినది. బడి విడిచిపెట్టువేళ యైనది. ఒకయరగంటలో బిల్ల లింటి కెగబడుదురు. త్వరగా పకోడీలు చేయవలెను. వాండ్రు వచ్చిన పని సాగనీయరు. తొందరగా బిండి కలిపి నేతిలోనొక సవాసేరునకు సుమారు పకోడీలు చేసినది. ఇదిగో పిల్లలు వచ్చుచున్నారు. "ఏమిటే అమ్మా! ఏదో కమ్మనివాసన వచ్చుచున్నది. ఏమివండినా వేమిటి? గారెలా, పకోడీలా, నేతిలో వేయించిన మసాళాసెనగపప్పా? ఏదో మాకుపెట్టకుండా దాచుకొన్నావు? మాకుకూడ పెట్టవే. నాన్న యొక్కడే తినవలెనా?" అని పిల్లలు గల్లంతుచేసినారు. "మీకుపెట్టకుండా నాన్న కెట్లా పెడతానురా? లెక్కకు నాలుగు మెత్తని పకోడీలు చేసినాను. మీనాన్న కవి యన్న నిష్టము ఇవిగో" అని చెరి కొంచెము చేత బెట్టినది. 'నాన్న కిష్టము గానిదేమిటి! పకోడీలు ఇష్టమే, గారెలు ఇష్టమే, చక్కిడాలు ఇష్టమే, నేతిలో వేయించిన కారపుసెనగపప్పు ఇష్టమే. మాకుమాత్ర మవి యిష్టము గావా' యని దుండగీడు కృష్ణుడు తర్కించినాడు. 'నాన్న సంపాదించుకొని రాకపోతే నీవెట్లా తింటా వేమిటి పకోడీ' లని పెద్దబ్బాయి రాముడు తమ్మునకు సమాధానము చెప్పినాడు. తనకుబెట్టిన పకోడీలు కొంచెము కొంచెము కొరికి తినుచు కమలము తృప్తిజెందినది. సరే యిక లెండి నాన్న వచ్చువేళ యైన దని వాండ్రకు తలలు దువ్వి స్నానము చేయించినది. శుభ్రమైన బట్టలు తొడిగి చామబొట్టు పెట్టినది. తానుగూడ తల దువ్వుకొని తిలకము దిద్దుకొనినది. అబ్బా ఏమికంపరమమ్మా చాకలి అంజిగాడు ఇస్త్రీబట్టలు తీసికొని రానేలేదు. ఇదిగో నదిగో నని రెండువారములనుండి గడుపుచున్నాడు. ఆయనగారి కీ నిమ్మపండుచాయ చీరె యన్న మిక్కిలి యిష్టము. ఆచీరె గట్టుకొన్నది. ఈసంవత్సర మెందులకోగాని మల్లియంటు సరిగా పూయలేదు. పందిరి బొత్తిగా పడిపోయినది. దానిని కొంచెము బాగుచేయింపుడని యెంత చెప్పినను భర్త చెవి కెక్కలేదు. ఏవియో మూడునాలుగు మొగ్గ లున్నట్లున్నవి. వానిని కోసి కమలము జడలో నిన్ని పెట్టి, తానిన్ని తన జారుముడిలో సవరించుకొన్నది. ఐదుగంట లైనట్లున్నది. భర్త యాఫీసునుండి బైలుదేరి వచ్చుచుండును. పాప మెంత యలసియుండినారో! వెధవ ఆఫీసు దాదా పరమైలు నడువవలెను. ఇదిగో వచ్చుచున్నట్లున్నారు. కాదు, ఎవరో దారిని బోవువారు. ఆ కాలిచప్పుడు వినవచ్చుచున్నది. చప్పున గుమ్మము దగ్గరకు వచ్చినది. అబ్బే ఆయనగారు కాదు. కుమ్మరి నాగన్న 'అయ్యగారితో కొంచెము పని యున్నదండీ, ఇంకను రాలేదా' అని యడిగినాడు. వచ్చుచుండవచ్చును. కొంచెముసేపాగుమన్నది. 'లేదండీ వెళ్లవలెను, తొందరపనియున్నది. రేపుదయము వచ్చి దర్శనము జేసికొందు' నని చెప్పి వెళ్లిపోయినాడు. అట్లే గుమ్మముదగ్గిర నిలబడి యెదురు చూచుచుండినది. పదిబారల దూరములో మలుపు తిరిగి ఆయనగారు కన్పడినారు. హృదయమా

హ్లాదమయమైనది. ముఖము వికసించినది. చిరునగవు పెదవులపై దాండవింప మొదలు పెట్టినది. చప్పున లోనికేగి మండువాదగ్గర సిద్ధముగా నుంచియుండిన జలపాత్రను దెచ్చి యెదురుగా వచ్చినది. చేతిగొడు గందుకొని, చెంబు చేతి కందించినది. ఇంతలో నాన్న వచ్చినాడని పిల్లలు కేరింతలు గొట్టినారు. కమలము అంగవస్త్రము దెచ్చి తుడుచుకొనుట కిచ్చినది. లోపలినుండి యొక పింగాణిపళ్లెములో మెత్తని పకోడీలు, కాఫీచెంబుతో చల్లనినుంచినీళ్లు తీసికొనివచ్చి, చావడిలోని బెంచీబల్లపై జదికిలబడి, ఉస్సురస్సురనుచు గాళ్లుచేతులు దుడుచుకొనుచున్న భర్తముందర బెట్టినది. వహావ్వా, ఏమి రొఖ్ఖం యీవేళ! మెత్తనిపకోడీలు!— మొత్తముమీద ఊరకుండడు. సంతోషపూర్వకమైన నవ్వు నవ్వినాడు. 'ఏమిరా కృష్ణా, నీవం తైనదా' అనినాడు. 'అయింది గాని నాన్నో...మఱి...' అని కృష్ణుడు నెమరువేసినాడు. 'ఏమిటక్కరివిరా యని నవ్వి, ఇవిగో యీరెండు తీసికో' అని పిల్చినారు. కృష్ణుడు బెట్టు చేసినాడు. 'వాడిదివరకే తినినాడు. ఇక వాడిని మారాము పెట్టకండి' అని చేరువ నున్న కుర్చీపీటమీద గూర్చుండియున్న భార్య యాతురతతో ననినది. రాముడు నాన్న సంతు నాన్నకే యనుస్వభావము గలవాఁడు. కమల యెట్లును ఆడపిల్ల. 'నాన్న ప్రొద్దునమొదలుకొని సాయంత్రమువరకు పని చేసినారు. ఎంతో ఆకలి వేసియుండును' అని జాలితో గూడిన ప్రేమతో ననుకొనినది. ఎంతతృప్తితో భర్త ఫలహారము చేయుచున్నాడు! ఇంక నాలుగు చేయనైతి ననుకొన్నది. 'కుమ్మరినాగన్న వచ్చి వెళ్లినాడు, మరల రేపుదయము వచ్చెద నన్నాడు. మీతో నేదో పని యున్నదట' అని చెప్పినది. 'వాడిమొఖం భడాయికోరు వెధవ. ఏదో పని యున్నట్లు ఆర్భాటాలు చేస్తాడు. చివర కేమియు నుండ' దని కోపగించుకొనినారు. పొరుగింటిసుబ్బమ్మ వచ్చి కందులపప్పు చేయుటలో దనకు దోడ్పడిన దనియు, ఎందుకు చేతనో గాని, చూపులకు బాగుగ నున్నను, పప్పు ఆటిరాలేదనియు జెప్పినది. మొత్తముమీద సుబ్బమ్మ మంచిమనిషి. ఒకవిధముగా విధవలు సంఘమునకు లాభమే. కాని వారికి కోర్కెలు, ఆశలు, తృష్ణలు ఎందులకుండవలెను? భగవంతుడు పరిపూర్ణు డందురు గాని, ఈవిషములో దెలివితక్కువపనియే చేసినాడు...కాని, తానే ఆడుజన్మమెత్తి పదునాలువత్సరములు దాటకమునుపే విధవయైన నెట్లు భరించెడువాడో?—ఏదో, ఎవరికర్మము వారిది. ఈచల్లని సాయంతన మప్పుడీపాడు తలంపు లెందులకు? భార్యవంక నిండుదృష్టితో జూచినాడు. ఎంత కలకల లాడుచున్నది. ఎంతశృంగారముగా, కన్నులపండువుగా నున్నది! ఆనిమ్మపండు చాయచీర యామె సువర్ణదేహమున కెంతయింపు నిచ్చుచున్నది. ఆమె కది, దానికామె అతికినట్లు సరిపోయినారు. సుబ్బమ్మ జ్ఞాపకము వచ్చినది. గుండెగుభేలుమన్నది. ఈశృంగారవతి, యీపూచిన తంగేడుచెట్టు కిర్మము చాలక విధవ యైన నెంతఘోరము! తా నప్పుడామెను జూచి సహించగలడా? కన్నుల పండువజేయుచున్న ఈపుణ్యస్త్రీని ఈ అర్ధాంగిని, ఈగృహలక్ష్మిని ప్రచండ ఝుంఝామారుత క్రూరహస్తముల బూవుల, నాకుల, లేగొమ్మల గోలుపోయి మోండి యయి మొరటుగ నున్న తంగేడుచెట్టువలె నుండు విధవనుగా జూచుటకు మన సెట్లొప్పును?—చటుక్కున జ్ఞాపకము వచ్చినది. తనలో దాను నవ్వుకొనినాడు. తాను నిండు జీవముతో మిటకరించి చూచుచుండగా తనభార్య విధవయెట్లగును! భర్తముఖమువంక తదేకధ్యానమున జూచుచున్న భార్య ఏమి టా రహస్య మని సగ ముత్సాహముతోను, సగమువింతతోను అడిగినది. 'ఏమిలేదు. నీ వెంతయు...నీకాచీర ఎంత అందముగా నున్న'దని చిరునగవుతో ననెను. విషయముల నర్థముజేసికొనుట కారంభించిన కమలము కొంచెము సిగ్గుపడినది. తల్లి ముఖమున నన్నియు గులాబిమొగ్గలే. తాను ప్రేమించు భర్త మెప్పెంత సంతోషకరమైనది.

ఫలహారము పూర్తియైనది. 'ఇక బైలు దేరుదమా? ప్రొద్దు గ్రుంకవచ్చుచున్నది. జయలక్ష్మి పెందలకడనే రండి, ఒకఘడియసేపు కూర్చుండి వెళ్లవచ్చు నన్నది.' అని యామె యనినది. 'ఇదిగో నేను సిద్ధముగనే

యున్నాను. నా నేలంఅంచు కండువా తెచ్చిపెట్టు' అని అనినాడు. భార్యాభర్తలు, పిల్లలు బైలుదేరినారు. వెంకటకృష్ణయ్యగారియిల్లు అదృష్టవశమున నూరికి బైటగా నటుప్రక్కన నున్నది. జనమధ్యముననుండి పోవనక్కరలేదు. ఆమలుపు దిరిగి నాలుగుబారలు పోయిన పంటకాలువ కన్పడును. దాని ననుసరించి రెండుఫర్లాంగులు నడచిన వారున్నవీథిని చేరుకొందుము. ఆవీథిలో గుడిప్రక్క పదియిండ్ల తర్వాత నున్నడాబాయే వెంకటకృష్ణయ్య జయలక్ష్మిగార్ల గృహము. ఎంత చల్లనిహాయిగొలుపు గాలి వీచుచున్నది? ఈసాయంతన సమయమెంతరమణీయము! అదిగో, సూర్యుడు మొగ మెంత ఎఱ్ఱజేసికొనినాడో చూడుడు. కటా, కాలమాహాత్మ్యము! ఈ యుదయముననే యతఁడు లేత గులాబిరంగుల నీనువదనముతో, ప్రకాశవంతములైన చిరునగవులు నగుచు, స్నేహయుతిముగ దన లేజేతుల జాచి, యందఱి నాలింగనము జేసికొనినాడు. ఈమధ్యాహ్నమున నతడెంత దుర్నిరీక్ష్యుడు! వయోగర్వము. మిత్రు లనక, బంధువు లనక, ఆశ్రితులనక, సహవాసు లనక, యందఱి నెట్లు నిరాకరించినాడో! తనరూక్షేక్షణముల నిప్పులు గుఱియుచు నందఱి నొకమూల నొదిగి యుండునట్లు చేసినాడు—ఆకాలము చెల్లినది. సాయంత్రమైనది, ఇప్పుడో, ముదుసలియై, ఎఱ్ఱగ బండి, ఇప్పటి తన యసహాయత్వమును, కొలదిగంటల క్రిందటనే తాను చూపించిన యౌద్ధత్యమును, తలచుకొని సిగ్గుచే మొగమెఱ్ఱబారినవాడై, ఎట్లు ప్రక్కప్రక్కకు నొదుగుచున్నాడో, దూర దూరముగ బోవుచున్నాడో! చూడుడు. ఈయుదయమున జూపిన మైత్రి, మధ్యాహ్నగర్వమున మాడియుండనియెడల తనయవసానకాలమున నెందఱు తనను గౌరవించెడివారో!తనయెడల నభిమానము చూపెడివారో!! దానికి మారుగ ప్రజాకంటకుడైన నిరంకుశప్రభువుపాలన మంత మొందినప్పుడు జను లెట్లుసంతోషింతురో యట్లే యిప్పు డతనియవసానకాలమున లోకము చల్లబడి సంతోషించుచున్నది. ఈయవమానమును తా నింక భరింపలేదు. సమీపమున నున్న పశ్చిమసముద్రమున ప్రాణముల బాపుకొను టుత్తమము. అదిగో ఎట్లు సాహసించి చటుక్కున దుమికినాడో!— కటకటా ఎట్టివారికి మృత్యువు తప్పదుగదా—సూర్యభగవానుని చైదములు మనకు క్రొత్తలుకావు. అతనిది దినదిన మరణము, దినదిన జననము. నిత్యము చచ్చి, పుట్టుచుండువారి విషయమున విచార మెందులకు? ఇంతహృదయాహ్లాదకరముగ మలయమారుతము వీచుచు, ఇంత ప్రశాంతముగ భూమ్యాకాశము లుండి, ఇంత కన్నుల పండువుగ వరిచేలు పండి, ఇంతరామణీయకముగ నిరుప్రక్కల జెట్లులుండిన ఒక్కసూర్యునేకాదు లక్షసూర్యులనైనను నిత్యము జంపుటకు వెలువవలసిన పని లేదు. నాన్నతో ముందు నడచుచుండిన కృష్ణుకు కబుర్లు కొట్టిపోయుచున్నాడు. వాని స్నేహితుడు సత్యమునకు జిన్నబైసికి లున్నది. నాన్న తన కొకటి కొనిపెట్టడా!—వాండ్ర తెలుగుపంతులు రామమూర్తిశాస్త్రులుగారు బడిలోనికి రాగానే 'నాన్నో, ఏమి జరిగిం దనుకున్నావు, యివ్వాళ? చలమయ్యగారి రామారావున్నాడే వాడు గాంధిమహాత్మునకు జై ఖద్దరుబట్టలకు జై యని కేకలు వేశాడు. క్లాసంతయును గొల్లున గగ్గోలు పెట్టింది. శాస్త్రులుగారికి గాంధిమహాత్ముడంటే యెంతో భక్తి. ఖద్దరుబట్టలన్నా మిక్కిలి యిష్టమే. కాని క్లాసంతా కేరింతలు గొట్టి గల్లంతు చేయటంతోనే శివమెత్తి 'పుండాకోర్ గల్లంతు చేస్తావా' అని రామారావుమీదికి దుమికాడు. రామారావు యీబల్లపైనుండి ఆబల్లపైకి, ఆబల్లపైనుండి యీబల్లపైకి, కోతిగంతులు వేశాడు. దానితో పిల్లలు మఱింత రెచ్చిపోయారు. శాస్త్రుల్లుగారు కోపాన్ని పట్టలేక చిందులు ద్రొక్కుతూ, కొండకేకలు వేస్తూ, హెడ్ మాస్టరును దీసుకొనివచ్చి వీడుంప దెంపుతాను చూడం డని ఒక్కలగువున మా పెద్దపంతులుగారిగది కేగాడు' అని చెప్పసాగినాడు. నాన్నకు తన బాల్యానుభవములు జ్ఞప్తికి వచ్చినవి. నవ్వుకొనినాడు. పిల్ల లెప్పుడును గొంటెవాండ్రే తనబాల్యమున నున్న పిల్లలకును, ఇప్పటిపిల్లలకును ఈవిషయమున భేదమిసుమంతయును లేదు. ఈరోజున చలమయ్యగారి రామారావు గల్లంతుచేయుటలో నాశ్చర్య మేమున్నది? తాను కూడ నట్లు చేసినవాడే.నిజమున కింతకంటె ఘోరములే

చేసియుండినాడు. తనమోకాళ్ల దండెములు, గోడకుర్చీలు, కోదండములు జ్ఞాపకము వచ్చినవి. అబ్బా, వేనినైన భరించవచ్చును గాని, గోడకుర్చీలు భరించుట కష్టము. రాక్షసులపద్ధతులు గాని యార్యులపద్ధతులుగావు. ఈ రోజులలోనట్టువంటి మోటుదండనలు తగ్గిపోవుచున్నవి. తగ్గిపోయినవనియే చెప్పవచ్చును. ఎట్లయినను గొన్నివిషయములలో గడచినదినములకంటె ప్రస్తుతమే యుత్తమముగ గన్పట్టుచున్నది. తల్లి కృష్ణుని మందలించినది. 'గురువుగారి నట్లు హేళన చేయవచ్చునటరా; భక్తి లేనిది చదు వెట్లు వచ్చును? పాపము శాస్త్రులుగార్లు ఈకాలముపంతుళ్లలో మిక్కిలి మెత్తనివారు. నిజమున కమాయకులు. అట్టివారిని గల్లంతుచేయుట మిక్కిలిచెడ్డపని. నీవుమాత్రము అల్లరిపిల్లలతో జేరవద్దని యామె బోధించినది. రామమూర్తి శాస్త్రులుగారి అమ్మాయి సీత తనసహాధ్యాయిని యనియు, మిక్కిలి నెమ్మదియైన పిల్లయనియు, వారియింటికి తానప్పుడప్పుడు వెళ్లుచుండుననియు, శాస్త్రులుగారు మిక్కిలి మంచివారనియు, తననెప్పుడాదరముతో బలుకరించుచుందు రనియు, కమలము చెప్పినది. అందఱికంటె వెనుక నడచుచున్న రాముడు 'శాస్త్రుల్లుగారు మంచివారే కాని, మా హెడ్‌మాస్టరుగారు మాత్రం తలతిక్క మనిషి' అనినాడు—ఆ, ఇంటిని సమీపించినారు. డాబాయరుగులమీద నింటిపిల్లలాడుకొనుచున్నారు. వెంకటకృష్ణయ్యగారు డాబాలో నేదియో చూచుకొనుచున్నట్లున్నది. వీరు సమీపించుటతోడనే పిల్లలు, తల్లికి జెప్పుటకు చప్పున నింటిలోనికి బరుగెత్తినారు. ఇంటి యజమానుడు మనవారు వచ్చినారని భార్యను గేక వేసినాడు. జయలక్ష్మి లోపలి నుండి వచ్చినది. 'ఎట్లా, ఐతే వచ్చారమ్మా, లోపలికిరం'డని తల్లిని బిడ్డలను లోనికి దీసికొనిపోయినది. తండ్రి వెంకటకృష్ణయ్యగారి యాహ్వానమున డాబాలోనికుర్చీమీద కూర్చుండినాడు. తనచేత నున్న కాగితము లటువైచి యింటియజమానుడు తన స్నేహితుని కుశల మడిగినాడు. 'ఏమిటో చూచుకొనుచున్నా'రని స్నేహితుడనినాడు. 'ఏమున్నదండీ, ఎప్పుడూ ఉన్నరాద్ధాంతమే గదా; ఈమధ్యజరిగిన దెబ్బలాటలకే'సని యజమానుడు జవాబిచ్చినాడు. ఔను నిజమే, మొన్న నేగదా ఆయూరువాం(డ్రు)కొట్టుకొనినది? ఇరువదియవ శతాబ్దములో మన మందఱము నాగరికులమైతి మని సంతోషించుచుండగ, కాట్లకుక్కలవలె నీపోట్లాటలేల? కడుపునకుదిన్నట్లా, కటికికిగట్టుకొన్నట్లా? తెలివితక్కువ ప్రసంగములు, మూర్ఖప్రసక్తులు, వ్యర్థవివాదములు, దురహంకారపునడవడులు, పశుకృత్యములు. వీడు బజారువెంట వెళ్లుచుండగ వాడు లేవలేదు. వాడు చెప్పినమాట వీడు వినలేదు. వీడు తనవోటును వానితరపు మనుష్యున కీయలేదు. ఇవి తగాదాకారణములు. మనలో క్షాత్రములే దందు రేమి? మనపూర్వులు దండయాత్రలు చేయలేదా, దిగంతములు జయించలేదా? ఆక్షాత్ర మెట్లు చచ్చును? మన కోడిపందెములు, మన పొటేళ్లపోరాటములు దానిని నిల్పియే యున్నవి. అట్టిచో చచ్చు దద్దమ్మలవలె నూరక యుండెదమా? బుజ్జ లెగరవలెను గాని తప్పో, యొప్పో, నాలుగుదెబ్బలు కొట్టి, నాలుగుదెబ్బలు పడినదే పౌరుషము. వెంకటకృష్ణయ్య స్నేహితుడు ఆకబుర్లు, ఈకబుర్లు చెప్పుకొనినారు—మధ్యాహ్నములలో జిరుచాపమీద గూర్చున్న యాడంగు లూరక యుండిరా? 'మీకమల మెంతనెమ్మదియైన పిల్లమ్మా; ఎంత వయస్సు? పెండ్లి యీడు వచ్చిందికాదా? ఈగాజు లెక్కడ చేయించారు? బాగానే ఉన్నవి కాని మావారు మొన్న మా పెదతల్లి కూతురుబిడ్డ పెండ్లికి బెజవాడలో, శ్రీలక్ష్మీజ్యూయలరీ కంపెనీవారివద్ద తెచ్చినగాజు లంత సొగసుగా లే వనుకొంటాను. మీరు కట్టుకొన్నచీరె మిక్కిలి బాగావున్నది. ఎక్కడ కొన్నారు? మొన్నీమధ్య చెన్నపట్టణము మాబావకొడుకు వెళ్లుచుంటే, రెండుచీరెలు తెమ్మని డబ్బిచ్చాను. అత డింకా వచ్చినట్టు లేదు.' జయలక్ష్మిమాటలు సాగిపోవుచుండెను. కాని కృష్ణు డూరకుండెనా? యేదియైన గిల్లి కజ్జము దెచ్చిపెట్టక మానడు. వారిరంగడు, కృష్ణు డెండులకో కీచులాడుకొనినారు; రంగ డేడ్వ మొదలుపెట్టినాడు. తల్లి కృష్ణుని చీవాట్లు పెట్టి, రంగని బుజ్జగించ మొదలుపెట్టినది. జయలక్ష్మి సరసురాలు. రంగనిదే తప్పై యుండునని సమాధానపరచ జూచినది. రాముడు కృష్ణునిదో

షము బైట బెట్టినాడు. సరే, ఇక వెళ్ళుటకు వేళయైనది. ఈపిల్ల లోకచోట కొంచెముసేపు నెమ్మదిగ కూర్చుండ నిచ్చెదరా? వారును సిద్ధమై యిక బైలుదేరుదమా యని నారు. సెలవుతీసికొని బయలుదేరినారు వెళ్లినమార్గమ ననే తిరిగి యింటికి జేరుకొనినారు.

వెంకి పాచి సరిగ నూడ్చి, వంటసామానులు శుభ్రముగా దోమినదో లేదో? చీకటి పడవచ్చుచున్నది. బుడ్లలోను, లాంతరులలోను చమురు పోయుమని చెప్పుటకు మఱచిపోయినాను. ఆమొద్దు కామాత్రము జ్ఞాన ముండిన నింక గావలసిన దేమి? వంట యారంభించినది. కమలము తల్లికి దోడుపడినది. ఆకలి వేస్తున్నదే అమ్మా' యని కృష్ణుడు కేకలు మొదలుపెట్టినాడు. ఇదిగో పూర్తికావచ్చుచున్న దని తల్లి సమాధానము చెప్పినది. ఈపూట యెట్లును ఆలస్యమైనది. స్నేహితు లన్నప్పుడు రాకుండను, పోకుండనా? జయలక్ష్మి మంచియిల్లాలు. వారి సంసారము మాసంసారము కంటె చాల మెరుగు. ఆయమ్మ యదృష్టము భర్తబాగుగా సంపాదించుచున్నప్పుడు, డాబాలు రాకయుండునా, వంటకత్తెలు తక్కువ యౌదురా!- ఏమో ఎవరి యదృష్టము వారిది. వంట పూర్తియైనది. భోజనములైనవి. పిల్లలు కొంచెముసేవు చదివి పరుండినారు. స్నానముజేసి తాను కూడ భుజించినది. భర్త యేదో పడకగదిలో జదువుకొనుచున్నట్లున్నాడు. ఇన్ని యాకులు వక్కలు చేత దీసికొని కంచుచెంబుతో నీరు పట్టుకొని గదిలోని కేగినది. ప్రక్కకుర్చీపై నాసీనయైనది. భర్త యామె రాక గ్రహించి యామెవంకకు దిరిగి చిరునవ్వు నవ్వినాడు. తాను నిజముగా నదృష్టవంతురాలు ఏమో! లక్షాధికారులు కాకపోయినను తాను తనభర్త సుఖముగ గాలక్షేపము జేయుచున్నారు. తనవివాహమై ఎన్నెసంవత్సరము లైనది? అప్పుడే పెద్దబిడ్డ కమలమునకు పండ్రెండు వత్సరములు దాటినవి. ప్రస్తుత లోకాచారముప్రకారము బిడ్డకు పెండ్లియీడు వచ్చినది. కాని ఆయనగారు పసిపిల్లలకు పెండ్లిం డ్లేమిటి? దేశములో నున్న బాలవిధవలు చాల కాయని కసరుకొందురు. ఏమో ఆయనగారి యిష్టము. 'కమలం సాగింది చూశారా?' అన్నది. అప్పుడే తాను చదువుచున్న దవతలికి బారవేసి భార్యవంక ప్రసన్న వదనముతో జూచుచున్న భర్త 'కమలం' దృఢమైన పిల్ల. ఏపుగా పెరుగగలదు. పెండ్లి, కార్యమని రభసలు పెట్టకపోయిన, చక్కగా బెరిగి యారోగ్యవతి యగు' ననెను. జయలక్ష్మిగారి యింటియొద్ద కృష్ణుడు చేసిన చిలిపితనము జెప్పినది. 'వాడు శ్రుతిమించి పోవుచున్నాడు. జాగ్రత్తపడకపోయిన చేయి మించి పోవచ్చును. చదువులో, సన్యాసి, కరుకే. గుబులు కుదిరి చదివిన వృద్ధిలోనికి రావచ్చును. వానిని బి. ఏ. వరకు చదివించిన బాగుగ నుండును. కాని డబ్బెక్కడనుండి వచ్చును? మీ జీత మెప్పుడు పెరుగు' నని భర్తను ప్రశ్నించినది. 'భగవంతుని కెఱుక. నే నెట్లు చెప్పగలను? నాపైయుద్యోగి నాయందు ప్రసన్నుడుగనే యున్నాడు. మాడిపార్టుమెంటులో నున్న చావే యిది. మావంటి చిన్నయుద్యోగుల లావాదేవులు, మాపైయధికారుల ఆగ్రహానుగ్రహములపై నాధారపడి యుండును!' అని నాడు. భార్య నిట్టూర్పు విడిచినది. ప్రపంచము మిక్కిలి యన్యాయమైనది. పాపము, రాత్రింబవళ్లు వారు కష్టించినను, తుదకు బిడ్డలకు సరిగా జదువు జెప్పించు యోగ్యతయైన నుండదు కాబోలును! 'రాముని స్కూల్ ఫైనల్ తో మాన్పించవలసియుండును. ట్రైనింగునకు పంపించి టీచరును జేయుటయా లేక యేతాలూకాకచ్చేరిలోనో చేర్పించుటయా? ఒకవేళ క్లీడరుగుమాస్తా బాగుగ నుండునేమో—వానియదృష్టము బాగుగ నున్న ఎంతయైన సంపాదించుకొనవచ్చును. వెంకటకృష్ణయ్యగారి గుమాస్తాను చూడుడు. ఆయనగా రేమి చదువుకొనినారు? ఏ ఫస్టుఫారమో చదివినా డందురు. మనిషి చూడబోయిన మఱింత తెలివిగలవాడుగా గన్పించడు. మాటలలో గాని, చేతలలో గాని సున్నితము లేదు. నిజమున కొబ్బెరకము మనిషి. అట్టివాడుగూడ సలక్షణముగ సంపాదించుకొనుట లేదా? ఈమధ్యనే దివ్యమైన డాబా కట్టినాడు. వెంకటకృష్ణయ్యగారి డాబా కేమాత్రము తీసిపోదు. ఈయనగారుమాత్రమే యను కొందమన్న, ఆవీథిలోని

రామసుబ్బయ్యగారి గుమాస్తా పనికూడ నాడుజోరుగా నున్నదట. అతడు మూడవక్లాసువరకైనను జదువుకొనలేదట. మొద్దా, దున్నపోతా, ఎందులోనైన పడి చావరాదటరా' యని తండ్రి మొదలైనవారు శాపనార్థములు పెట్టుచుండెడివారట. వారిపోరు పడలేక యింటిలోనుండి పారిపోయి, అక్కడక్కడ గొన్నినాళ్లు తిరిగి చివరకు రామసుబ్బయ్యగారియొద్ద ప్రవేశించినాడట. ఇప్పు డతడొక పెద్దవ్యవహర్త. ప్లీడరుగారికి మాడ యయిన తనకు వరహాక్లయంటులను పిశాచమువలె పీడించుకొని తినునని చెప్పుకొందురు. ఎల్లేడ్చిన నేమి? అప్పుడే యిరువదియెకరముల బంగారమువంటి మాగాణి సంపాదించినాడు. భర్త యుద్దేశ్యము టీచరును జేయవలెనని కాబోలు 'ఇప్పు డేమితొందర వచ్చినది? ఇంకను గొన్నివత్సరములు గడువవలయును గదా. అప్పటిసంగతి యప్పుడు చూచుకొనవచ్చు' ననినాడు. చటుక్కున మంచమునుండి దిగి భార్యను సమీపించి, 'కొంచెము మంచినీ ళ్లీయు'మని యడిగినాడు; మంచినీరు త్రాగి రెండవకుర్చీని లాగి దగ్గరగా వేసికొని తానుకూడ తాంబూలచర్వణ మారంభించినాడు. కిటికీ పూర్తిగ దెఱచి యున్నది. ఎంతహాయిగా మలయమారుతము వీచుచున్నది. పూర్ణిమ యెన్నిరోజులలోనో లేదు. శైటు పిండియారబోసినట్లు వెన్నెల కాయుచున్నది. ప్రియురాలి యాలింగనమున కెంత యింపైన రాత్రి! మీద జేయి వేసి దగ్గరకు దీసికొనినాడు. దేహముప్పొంగ నిండుగ గౌగిలించుకొని, హృదయమున నత్తుకొనినాడు. ప్రేయసి అర్ధనిమీలతలోచన యైనది. ఆమె మృణాళబాహువు లతనికంఠమును బెనవైచినవి.— హృదయములు కలిసిన దంపతులప్రేమ యెంత గాఢమైనది! ఎంతనిర్మలమైనది! ఎంతనిశ్చలమైనది! దాంపత్యసౌఖ్యము మానవజీవితమును ధన్యము చేయును.

స్త్రీ గృహలక్ష్మి. ఆమె తనయిల్లు పాడుపడిన దేవాలయము పుష్పించిన మల్లెపందిరివలె, పొన్నచెట్టువలె, నామె గృహమును శోభాయమానము జేయును. ఆమెయునికివలన గృహము కలకలలాడుచు, నిరంతరము నవ్వుచుండును. ఆమె భర్తకు జేయూత! అతని కామముల దీర్చునప్సరస; అతని సంసారసాగరమును ధరింప జేయునౌక; అతనిజన్మకు సార్థకము; అతనికి ముక్తి నిచ్చుపరదేవత. ఆమె లేనియెడల నతనిజీవిత మంతయు నంధకారమయము; వ్యర్థము.

శకుంతల

పెనుమర్తి వెంకటరత్నము గారు

౧

తాను మహామునీంద్రుఁడు గదా! సుఖదుఃఖము లాఁగి నిశ్చల
ధ్యానసమాధిలో యుగశతంబులు దివ్యతపస్సుఁ జేసి యా
త్రానధిగమ్య పూర్వవిదితం బగు బ్రహ్మశరీర మందె! నా
నా నిఖిలాండజాండములయందు వెలింగెను సప్తసప్తి యై.

అట్టి మహానుభావుఁ డగునా! మరి యన్యసమాధిభీరు వై
కట్టిడి చేఁతలందు నెఱకాఁ డగు నింద్రుని యప్సరోంగనఁ
బట్టి రమించి పాశవిక పాశములం బడెఁ గాని లోనఁ జూ
పట్టెడు తేజు మబ్బువడి భావివిధానముఁనే నెఱుంగఁడే!